## సిద్ధిపురి కథలు

-ఐతా చంద్రయ్య-

ఇ.నం.4-4-11
శేర్‌పుర
సిద్ధిపేట్-502 103.

# అర్ధ మొగుడు

తమ్ముడు రాసిన ఉత్తరాన్ని తనివి దీరా చదువుకుంది జాంబవతి. మొహం మొగిలి పూవైంది.

"ఆ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదువుతావు జాంబూ" వెనక నుండి ఎప్పుడొచ్చాడో తెలీదు... భర్త కృష్ణమూర్తి చేతులు నడుమును చుట్టేశాయి! తియ్యని పులకింత.

కోటీశ్వరుని కూతురు జాంబవతికీ, కేంద్ర ప్రభుత్వోద్యోగి కృష్ణమూర్తికీ మూడేళ్ళ క్రితం ముడి పడింది. పారుపల్లి వీధిలోని అద్దింటిలో సెటిలైన ఆ చిలకా గోరింకలు అప్పుడే పిల్లా పీచు వద్దనుకున్నారు.

"మీకూ ఓ తమ్ముడుండి, అతగాడు ఢిల్లీలో జాబ్ చేస్తూ మీకో జాబురాస్తే తెలిసుండేది..." బుంగ మూతితో వెనక్కు తిరిగింది.

"అబ్బో... చిరుకోపం నీ అందాలను వందరెట్లు చేసిందోయ్!" సిగ్గుల బుగ్గల్ని పెదాలతో తడిపేశాడు. ఎవరన్నా చూస్తారేమోనని కష్టంగా ఉన్నా అది ఇష్టంగానే ఉంది జాంబవతికి.

హఠాత్తుగా భర్త కళ్ళలోకి చూసింది. ఎప్పట్నుండో ఎదను తొలిచేస్తున్న స్త్రీ సహజమైన అనుమానం తళుక్కుమంది బుర్రలో.

"ఏమండీ... మీకూ... ఆడ పిల్లల్తో పరిచయాలు న్నాయా?" గోముగా అడిగింది.

"పరిచయాలా! ఎందుకుండవ్... చాలా ఉన్నాయి." జారుడు బండమీంచి జారిపడినట్టన్పించింది.

"అమ్మో అమ్మో... ఐతే నా కాపురం కూలి పోతుంది దేవుడోయ్...!" గుండెలు బాదుకుంది. మొహం కందిపోయింది.

"పరిచయాలంటే... మామూలు పరిచయాలే జాంబూ!" ప్రణయం ప్రళయంగా మారకముందే జారుకున్నదే క్షేమ మన్పించింది."

"సరే... నేను ఆఫీసుకెళ్తున్నా... తలుపేసుకో!" వెళ్ళిపోయాడు.

... మా శ్రీవారు అపర శ్రీరాముడనుకున్నానే... సోఫాలో కూలబడింది, అరచేతులు గడ్డానికానించి ఆలోచనల్లో మునిగి తేలుతోంది.

ఎదురుగా గోడకు వేళ్ళాడ్తున్న శ్రీకృష్ణ రాసలీల పటం అదోలా నవ్వింది.

"పార్పల్లి స్ట్రీట్... ఘర్ నెంబర్ సోలా... యహీ హైనా... ఇదేనా?" అందాల బరిణ ఒకతి ఇంట్లో కొచ్చేసింది.

అపిల్ పండు దేహఛాయ, గుండ్రని మొహం, చెంపలకు చారెడేసి కళ్ళు... రెండు కలువల మధ్య నిండుగా ఉదయిస్తున్న బాలార్కుడిలా, రెండు కళ్ళ మధ్య బొట్టు... మంచి అందగత్తె.

జాంబవతి మనసు కల్లుదాగిన కోతైంది.

"అనుకుంటున్నా... ఎవతో కొంపమీది కొస్తుందని... వచ్చావా... దా... నీ కాళ్ళిరగ్గొడ్తా... ఎవతివే నువ్వు?"

"మేరా నామ్... నాపేరూ...!" చెప్పబోయింది.

"ఏపేరైతేనేం? మా వారిని బుట్టలో వేసుకుంది గాక ఇంటి మీదికి రావాల్నా? వెళ్ళెళ్ళు!"

"అబ్బే... నేనూ... మీ..." అందాల బరిణ అయోమయం.

"నాకింకేమీ చెప్పొద్దు, పో... గెటౌట్ బద్మాష్!" దిగ్గున లేచి గొంతు చించుకుంది.

గుండెలెగిసి పడ్తున్నై కళ్ళు చెమ్మగిల్లినై. ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

"హమ్మో... మొగబుద్ధి మొరటు బుద్ధి అంటే ఏ: టో అనుకున్నా... మళ్ళీ సోఫాలోకి జారుకుంది.

ఎందుకైనా మంచిది, తలుపులు వేద్దామని లేచి ముందుకు కదిలింది. తుమ్మ మొద్దులా గున్నాడెవడో... మొహం బొగ్గు ముద్దలాగుంది. తెరిస్తే గాని నోరెక్కడుందో తెలిసేట్టులేదు... లోపలి కొచ్చేస్తున్నాడు.

దైన్యం ధైర్యంగా మారింది.

"ఎవడ్రా రౌడీ వెధవా!" ఒక్క తన్ను తన్నింది.

కాలేజీలో నేర్చుకున్న కరాటె ఇప్పుడు పనికొచ్చింది. తలుపులు వేసొచ్చి టీ.వీ. ముందు కూచుంది. అల్లకల్లోలమైన అంతరంగానికి తెలుగు ప్రోగ్రాం రుచించలేదు. టక్కున టీ.వీ. ఆపేసింది.

ఎవరో తలుపు తడుతున్నారు. ఐతే మళ్ళీ వాడే వచ్చుంటాడు వెధవ! నా తడాకా చూపించాలి. గబగబా వెళ్ళి తలుపుతీసి గల్లా బట్టి లోపలికి లాక్కొచ్చింది. గుద్దు గుద్దాలని చెయ్యెత్తింది. అతడు.. వాడు కాదు.

"ఇదేంది జంబూ! నేనూ... నీ మొగుణ్ణి" సింహం చేతిలో చిట్టెలుకలా వణికి పోతున్నాడు కృష్ణమూర్తి.

జాంబవతి గుండె జారింది. గల్లా వదిలేసి చేతులు పట్టుకుంది.

"అయ్యో... అదేమిటండీ.. మీ మొహం నిండా రంగు... డ్రెస్సునిండా...!" బేజారైపోతుంది.

"ఈ రోజు హోలీ కదా! మాకు సెలవు లేదాయె. ఆఫీసుకెల్తొంటే ఇదీ గతి! ఐనా... నువ్వీ రోజు అపర కాళీవైపోయావేమిటీ?" గాలికి కొట్టుకుపోతున్న గడ్డిపోచలా వెళ్ళి సోఫాలో కూలబడ్డాడు.

"అరెరే... మా తమ్ముడూ, మరదలూ ఈ రోజే వస్తామని రాశారు గదండీ. ఇక్కడెవరికీ తెలీకుండా వాడా హర్యానా అమ్మాయిని ప్రేమించి పెళ్ళిచేసుకున్నాక మనమే రమ్మని రాశాం గదా! వాళ్ళెట్లొస్తారో!'

"అనుమానం ముందుబుట్టి ఆడది తర్వాత పుట్టిందని అందుకే అన్నారేమో! మీ తమ్ముడూ, మరదలు వచ్చేశారు. నీ దెబ్బకు బయటపడున్నారు. పోయి చూడూ...!

బయటికెళ్ళి తుమ్మమొద్దునూ, అందాల బరిణనూ తీసుకొచ్చింది.

"ఈ రోజు హోలీ అని మరిచాన్రా మధూ! కొత్త పెళ్ళికూతుర్నికూడా తరిమేశాన్రా!" తమ్ముని చేతులు పట్టుకుంది.

ఢిల్లీ జంట గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నారు.

"పోనీలే అక్కా... మా బావగారు రాకపోతే బేకారైపోయేది!"

"నమస్తేజీ...నా పేరు రాధాబాయి. మీ మరదల్ని. తెలుగు కొద్దిగా తెలుసు. ఢిల్లీలో తెలుగు గల్లీలో ఉన్నాం...!" అందాల బరిణ చేతులు జోడించింది.

"ఛీ పాడుపని చేశానమ్మా... పొరపాటైంది."

"అదేం కాదు, మీరు మేరీ ఆడబిడ్డయినా అర్ధ మొగుడనిపించుకున్నారు."

నవ్వుల పూల జల్లు కురిసింది. వెల్లువైపారింది.